# ఓ తండ్రి వ్యధ

సర్వేశ్వరరావు కళ్లమ్మట నీళ్లు రావటం లేదుగానీ కుళ్ళి కుళ్ళి ఏడుస్తున్నాడు. కొడుకుని చేజేతులా పోగొట్టుకుంటున్న దుఃఖం అతని గుండెని పిండేస్తోంది. కడుపులో పోటుతో విలవిల్లాడిపోతున్న కొడుకు కన్నీళ్ళనీ, మూగరోదనాన్నీ చూస్తూ కూడా ఏం చేయలేదు.

స్వతహాగా తనూ డాక్టరే అయినా అది అపెండిసైటిస్ అని తెలిసినా ఇరవై నాలుగు గంటల్లో ఆపరేషన్ చేసి తీరాలని అతనికి అర్థమయినా, ముప్పయ్ ఆరు గంటలు నరకయాతన పడుతున్న కొడుకుని అలా వదిలేశాడు.

కసాయివాడిలా– కన్న తండ్రేనా అనిపించేలా–

ఇప్పుడు కళ్లమ్మట నీళ్ళొస్తున్నా అది కొడుకు పోయిన దుఃఖంతో కాదు. తన మీద తనకే కల్గుతున్న అసహ్యంవల్ల తన పాపాన్ని కన్నీళ్లతో కడుక్కుంటున్నాడు.

'కన్న కొడుకుని చేతులారా హత్య చేసినంత అనీ... హత్యచేసినట్టే' అనీ ఫీలవుతున్నాడు.

వాడికన్న తల్లే ఉంటే ఈ హత్య జరగనిచ్చేదా?

ఆవిడ ఉంటేతనీ పని చేయగల్గేవాడా?

చెయ్యాల్సిన అవసరం కూడా ఉండేది కాదు.

ముప్పయ్యేళ్ళక్రితం ముద్దలా బయటపడినప్పుడు తల్లి కేరుమంటే.. కొడుకు పుట్టాడని సంబరం చేసుకున్నారు. కొన్ని రోజులకి తెలిసింది వాడికి ఏడ్చేందుకునోరు లేదని. మాటలు నేర్పే ప్రయత్నం చేద్దామంటే చెవులు కూడా వాడికి సహకరించట్లేదు... మెదడుకి, చెవులకి వున్న నెర్వస్ సిస్టంలో తేడా వుంది. వయసు పెరుగుతున్నా మెదడు ఎదగట్లేదు.

డాక్టరయిన సర్వేశ్వర్రావు కుర్రాడి స్థితిని గమనిస్తూనే ఉన్నాడు. కొన్నేళ్ళే... వీడాయుర్దాయమని ఆయనకి తెలుసు. కానీ తల్లి కన్న మమకారం వాణ్ణి ఇన్నేళ్ళు పెంచింది.. కాదు ఆయుర్దాయాన్ని పెంచింది!

కేవలం మాతృశక్తితోనే వాడన్నేళ్లు బ్రతికాడు అని సర్వేశ్వర్రావు

నమ్మేవాడు.

వాడి దురదృష్టం ఏంటోగానీ మందుల్తో కడుపునింపి టానిక్కులతో దాహం తీర్చి మంచం దిగలేనంత పుష్టిగా చేసిందిగానీ.. ఆ తల్లి అతని మెదడు శృతి చేయలేకపోయింది.

అపురూపంగా చూసుకొనే కన్నతల్లి పోయినప్పుడు ఏడావాలని కూడా తెలియని కొడుక్కి సర్వేశ్వర్రావు అమ్మ ప్రేమనీ, నాన్న ప్రేమనీ పంచిచ్చాడు. బాగా అలసిపోయాడు.

ఈ మధ్య రెండుసార్లు హార్ట్ ఎటాక్కూడా వచ్చింది. తన బతుక్కి ఫుల్‌స్టాఫ్ పడబోతోందని అర్థమౌతోంది.

ఇద్దరు ముగ్గురు అయినావాళ్లనీ, కొందరు ఆయాల్నీ కొడుకు సేవకి వినియోగించాలనీ ప్రయత్నం చేశాడు. ఎవ్వరిలోనూ మమకారం కనిపించలేదు.

నోరులేని వాడికి అడగందే పెట్టేది అమ్మ మాత్రమే.

వినలేని వాడిని కసితీరా తిట్టంది అమ్మ మాత్రమే.

మెదడులేని వాడిని ఆదరించేది అమ్మ మాత్రమే.

రాన్రానూ కొడుకు మెదడు కదలికకి కూడా సహకరించలేక పోతోంది. మంచంలోనే భోజనం! సమస్తం!!!

చెయ్యలేకో చూడలేకో తల్లి ఓ రోజు పక్షవాతంతో పడిపోయింది. దేవుడి దయ వల్ల వెంటనే పిలుపందింది. "నువ్వు లేకపోతే నేనెలా బ్రతగ్గలనే" అన్నాడు సర్వేశ్వర్రావు.

"మీరు బ్రతకాలి, మీరు బాబును చూడాలి. వాడికి మీరే ఇంక అమ్మవ్వాలి" అని చేతిలో చెయ్యేయించుకుంది.

వెళ్ళిపోయింది.

ఆవిడకిచ్చిన మాట ప్రకారం కొడుకుని చూస్తున్నాడు గానీ... కాదు.. చూడ్డానికి ప్రయత్నం చేస్తున్నాడుగానీ... ఇంక తన వల్లా అయ్యేలా లేదు. తనేర్పాటు చేసిన ఆయాలూ- ఆయా బంధువులూ తను భార్యకిచ్చిన మాట నిలబెట్టేలా లేరు.

పోనీ ఏ అనాథాశ్రమంలోనైనా, వికలాంగుల సంక్షేమ హాస్టల్లోనైనా అతన్ని చేర్పించమని పక్కింటి వాళ్లు మొహమాటపడుతూనే సలహా ఇచ్చారు.

సర్వేశ్వరావు ఆలోచనలో పడ్డాడు. మనసొప్పుకోవడం లేదు. ముఖ్యంగా భార్యకిచ్చిన మాట అతని మనసుని నలిపేస్తోంది. ఆవిడ ఫోటోకి బొట్టెట్టి కన్నీళ్ళెట్టుకుని "నీ కొడుకుని నీ అంత బాగా చూళ్ళేకపోతున్నాను. నన్ను క్షమించు. కానీ వాణ్ణి వికలాంగుల ఆశ్రమంలో జేర్పించాలి. తప్పదు. నువ్వపార్థం చేసుకోవు కదా? మన బిడ్డకోసమే కదా" అని వెళ్ళాడు.

అక్కడి పరిస్థితి చూసి తనే బాగా చూసుకోగలను అనుకున్నాక "భగవంతుడా నేను చనిపోయేలోగా వీణ్ణి వాళ్ళమ్మ దగ్గరకు చేర్పించు" అంటూ నిత్యం ప్రార్థిస్తూ ఉండేవాడు.

నిజానికి భార్య ఎప్పుడూ తన కొడుకుని వికలాంగుడు అంటే ఒప్పుకునేది కాదు. తన ప్రయత్నాన్ని ఎంతగా ద్వేషించిందో తన కొడుకుని తన దగ్గరకే తీసుకుపోయింది. పోనీ తనుండగానే ఈ అంపకం జరిగిపోయింది.

ఏ మునిసిపాల్టీ వాళ్లో ఈడ్చుకుపోకుండా తన కొడుక్కి తనే అంత్యక్రియలు చేసాడు. సర్వేశ్వరావు కొడుకు మీద పడి బావురుమని ఏడవలేదు.

భార్య ఫోటోని చూసి వెక్కి వెక్కి ఏడ్చాడు.

ఈ దుఃఖంలో అతనికి రెండు నిర్ణయాలు స్ఫురించాయి. ఒకటి ఇల్లమ్మేయడం, రెండోది గయ వెళ్లి తనకీ పిల్లాడికీ శాశ్వతంగా శ్రాద్ధం పెట్టడం.

✦ ✦ ✦

"డాక్టరుగారూ మీరిల్లమ్ముతానన్నారు గనక కొంటున్నాంగానీ, మీరు మాకు దూరమవుతారంటే బాధగానే ఉంది" అన్నాడు పక్కింటతను.

"నేనమ్మట్లేదు మీరు కొనట్లేదు. మీరు నాకు సాయపడతున్నారంతే" అని సర్వేశ్వర్రావు తనకి కావలసిన కాస్త సామాను తీసుకుని, ఇంట్లో ఉన్న వస్తువులన్నీ పేదవాళ్లకి పంచి ఇచ్చేశాడు.

✦ ✦ ✦

గయలో సర్వేశ్వర్రావు శాశ్వతంగా స్వర్గప్రాప్తికోసం భార్యకు తర్పణాలొదిలాడు. కొడుక్కి "అమ్మే నిన్ను బాగా చూసుకుంటుందిరా- అమ్మ దగ్గరకెళ్లరా" అని దోశెడు కన్నీళ్లతో తర్పణం చేసి బావురుమని ఏడ్చాడు.

గయలో శ్రాద్ధం చేస్తోన్న పురోహితులు-

"అయ్యా మరోలా భావించకపోతే మీకు వారసులెవరూ లేరు కదా! మీరు కూడా ఆత్మశ్రాద్ధం పెట్టుకుంటారా?" అని అన్నారు.

"వద్దు నాకే స్వర్గానికెళ్ళే కోరిక లేదు. ఆ తల్లీ కొడుకుల దగ్గరకి నేను వెళ్ళలేను. నేను పాపిష్టివాణ్ణి" అని నీట్లో ఒక మునక మునిగాడు సర్వేశ్వర్రావు, మళ్లీ లేచాడో లేదో తెలీదు.